క్లుప్తంగా

ఐదెకరాల్లో యూకలిప్టస్ తోట దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రావికమతం: మండలంలోని టి.అర్జాపురం ఆర్ఆర్ రెస్టారెంట్ ఎదురుగా గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో మడగల అర్జున్‌కు చెందిన ఐదెకరాల్లోని యూకలిప్టస్ తోట దగ్ధమైంది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే రావికమతం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. సకాలంలో అగ్నిమాపక శకటం వచ్చి ఉంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదని, ఈ ప్రమాదంలో రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని అర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖకు చెందిన వ్యక్తి నుంచి ఐదెకరాలను లీజుకు తీసుకొని యూకలిప్టస్ తోటను అర్జున్ సాగు చేస్తున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: పరీక్షల్లో ఉత్తమ ఫలితాలతో తల్లి దండ్రుల కళ్లల్లో విద్యార్థుల ఆనందాన్ని చూడాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. కింతాడ పంచాయతీ జోగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 1 నుంచి 5 తరగతుల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహంగా గురువారం నోట్ పుస్తకాలను అందజేశారు. మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతిగా వీటిని అందించినట్లు ఎంఈవో తెలిపారు.

ఏఎల్ పురంలో మజ్జిగ పంపిణీ



ఏఎల్‌పురంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు, ఎస్ఐ తారకేశ్వరరావు

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో సత్య సాయి ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో గురువారం బస్ షెల్టర్ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులు, అటుగా వెళ్లే వాహనదారులకు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పురం ప్రాంత సత్యసాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మౌనదీక్ష



మౌనదీక్ష చేస్తున్న జనసేన కార్యకర్తలు

నర్సీపట్నం: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన నేతలు గురువారం ఒక్కరోజు మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నర్సీపట్నం ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వూడి చక్రవర్తి, అల్లాడ సురేష్, గండెం దొరబాబు, కోనా నారాయణరావు పాల్గొన్నారు.

వడ్డాదిలో అగ్ని ప్రమాదం



ఇంట్లో దగ్ధమైన గృహోపకరణాలను చూపిస్తున్న బాధితుడు వెంకటరమణ

బుచ్చెయ్యపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వడ్డాది కోవెల వీధిలో గురువారం మధ్యాహ్నం కోవెల వెంకటరమణ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. గ్రైండర్ స్విచ్ ఆన్ చేసి ఉండడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటి యజమాని వెంకటరమణ ముందుగా విద్యుత్ సరఫరాను నిలుపువేసి, మంటలను అదుపు చేశారు. అప్పటికే మంచాలు, టీవీ, గ్రైండర్, ఏసీ, ఇతర వస్తువులు కాలిపోయాయి.

మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం రేపు

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో మరిడిమాంబ ఆలయ మొదటి వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు గ్రామ కమిటీ సభ్యుడు, ఎంపీటీసీ బుల్లి ప్రసాద్ తెలిపారు. గ్రామంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

భయపెడుతున్న గ్రంథాలయ భవనం



శిథిల స్థితికి చేరిన నాతవరం గ్రంథాలయ భవనం



నాతవరం: ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడానికి దోహదపడిన గ్రంథాలయ భవనం శిథిలమై ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో గ్రంథాలయానికి వెళ్లడానికి పాఠకులు ఆనాసక్తి కనబరుస్తున్నారు. మండల కేంద్రం నాతవరంలో 1988లో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. ఈ గ్రంథాలయంలో ఉన్న పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు చదివిన అనేక మంది నిరుద్యోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందారు. మండలంలోని 31 పంచాయతీల నుంచి అనేక మంది నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు వచ్చి ఈ గ్రంథాలయంలో చదువుకుంటూ ఉంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ గ్రంథాలయ భవనం శిథిల స్థితికి చేరుకుంది. ప్రస్తుతం శ్లాబ్ పెచ్చులూడిపోయి గదుల్లోనే పడుతున్నాయి. శ్లాబ్‌కు ఉన్న ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠకులు భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం వర్షం పడినా శ్లాబ్ లీకేజీ ద్వారా నీరంతా గదిలోనే నిలిచిపోతోంది. అటువంటి సమయంలో గ్రంథాలయంలోని పుస్తకాలతో పాటు ఇతర మెటీరియల్ తడిసిపోతోంది. పుస్తకాల సంరక్షణకు గ్రంథాలయ నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల రాత్రి సమయంలో కురిసిన వర్షాలకు పుస్తకాలు తడిచిపోయి చాలా వరకు పాడైపోయాయి. ప్రస్తుతం శిథిల భవనాన్ని చూసి లోపలకు వెళ్లేందుకు పాఠకులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేపట్టడం, లేదా పునర్నిర్మాణం చేపట్టాలని మండల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రంథాలయంలోకి వెళ్లేందుకు భయమేస్తోంది..




నాతవరంలో ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూడిపడుతున్నాయి. గదుల లోపల శ్లాబ్ ఊసలు బయటకు కన్పిస్తున్నాయి. వర్షం పడితే గదుల్లోనే నీరు నిల్వ ఉంటుంది. వరండాలో కూడా అదే పరిస్థితి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రంథాలయంలోకి వెళ్లేందుకు భయంగా ఉంటుంది.

– సందీప్, నిరుద్యోగ యువకుడు, చమ్మచింత గ్రామం



పెచ్చులూడిన గ్రంథాలయ భవనం శ్లాబు



వరండల్లో సైతం పెచ్చూలూడిన శ్లాబు

జీవో–35పై పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల నిరసన



ఎంపీడీవో కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలుపుతున్న పీఆర్ ఉద్యోగులు

కె.కోటపాడు : ప్రభుత్వం ఈ నెలలో విడుదల చేసిన జీవో నంబర్ 35తో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు నిరసనకు దిగారు. జీవో నంబర్ 35లో సవరణలు చేసి మళ్లీ విడుదల చేయాలని గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లరిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో ఎంపీడీవోల పదోన్నతి సమయంలో పరిపాలనాధికారులకు 34 శాతం, పంచాయతీ విస్తరణాధికారులకు 33 శాతం, గ్రూప్–1 ద్వారా వచ్చిన వారికి 30 శాతం, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా వచ్చిన వారికి 3 శాతం రిజర్వేషన్‌లను అమలు చేసే వారని గుర్తు చేశారు. ఇప్పుడు జీవో నం.35తో ఎంపీడీవోల పదోన్నతులలో పంచాయతీ విస్తరణాధికారులకు 60 శాతం రిజర్వేషన్‌లు కల్పించగా, గతంలో ఉన్న విధంగానే పరిపాలనాధికారులకు 34 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తుండడం అన్యాయమన్నారు. ఈ జీవో అమలు చేస్తే జిల్లా, మండల పరిషత్‌లలో పని చేస్తున్న పరిపాలనాధికారులకు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లకు, టైపిస్ట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌లకు అన్యాయం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, పి.అరుణ, సీనియర్ సహాయకులు జి.దివ్య స్వరూప, జూనియర్ సహాయకులు బి.వి.ఎం.ఆర్.కుమార్, టైపిస్ట్, ఆఫీస్ సబార్డినేట్ పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదం చేయండి



శోభాయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకొండలరావు

మాడుగుల రూరల్: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లిలో జరిగే హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను గురువారం కె.జె.పురం రామాలయం వద్ద ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం 3 గంటలకు అనకాపల్లి సుంకరమెట్ట జంక్షన్‌లోని శ్రీసూర్యనారాయణ దేవాలయం నుంచి ఈ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల కోశాధికారి పరిమి కాసుల జగ్గారావు, ఆర్ఎస్ఎస్ ఉపాధ్యక్షుడు వాలంకీ శ్రీనివాసరావు, వీహెచ్‌పీ ప్రతినిధులు ఆడారి శ్రీనివాసరావు, సాలాపు జగన్నాథరావు, శరగడం ప్రసాదు, కాళ్ల ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట శివాలయంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు గురువారం భూమి పూజ చేశారు. స్థానిక సర్పంచ్ యల్లపు విజయకుమార్ అభ్యర్థన మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జెడ్పీటీసీ రాంబాబు రూ.5 లక్షలు జెడ్పీటీసీ నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగన్నాథరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యల్లపు గోవిందరావు, పాఠశాల వైస్ చైర్మన్ శరగడం వెంకటప్పారావు, పెంటకోట కృష్ణ, గణేశ్, నాగేశ్వరావు, వెంకటజగ్గారావు, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూములను సర్వే చేయాలని వినతి



బుచ్చెయ్యపేట తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: మండలంలో ఆర్.భీమవరంలో తగాదాలు, వివాదాలు, ఆక్రమణలతో ఉన్న భూములను సర్వే చేసి డీ ఫారం పట్టాలు పొందిన వారికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం తహసీల్దారు ఎం.లక్ష్మిని కలిసి పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబరు 173లో 67 ఎకరాలపై పలు తగాదాలు, వివాదాలు, ఆక్రమణల సమస్య ఉందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోను ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత కలిగి పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నర్సీపట్నం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పని చేస్తున్నారన్నారు. పోరాడి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును సాధించుకున్నారన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న వందల కోట్ల రూపాయలని ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు తరలించారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణిస్తున్న వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అనంతరం వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

దేవరాపల్లి: భూసమస్యపై సామరస్యంగా చర్చించేందుకు వెళ్లిన తమపై దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని దేవరాపల్లికి చెందిన జాగరపు రాజునాయుడు, సోమిరెడ్డి అప్పలనాయుడు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవరాపల్లి సర్వే నంబర్ 277/12లో సుమారు 5.16 ఎకరాలకు సంబంధించి ఇరువురి మధ్య గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. వివాదం కోర్టులో ఉన్నప్పటికీ వారు సదరు భూమిలోకి వెళ్లడంతో చర్చించేందుకు వెళ్లిన తమపై వేరే వర్గానికి చెందిన ఐదుగురు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వికలాంగుడినైన తనపై మూకుమ్మడిగా దాడికి తెగబడి, నెట్టేశారని బాధితుడు జాగరపు రాజునాయుడు ఫిర్యాదు చేశారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



గాంధీజీ, అంబేడ్కర్ చిత్ర పటాల వద్ద పూలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



కింతాడ పంచాయతీరాజ్ దినోత్సవంలో మాట్లాడుతున్న సర్పంచ్ ముత్యాలనాయుడు

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్ర పటాల వద్ద ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం గ్రామాలభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్లు కింతాడ సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు తెలిపారు. కింతాడ పంచాయతీలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ నిధులతో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంను అనుసరించి పాలన సాగిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి వై.అనురాధ తెలిపారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి సాయం



ముకుందపురంలో ఆదినారాయణ కుమార్తె వివాహానికి హాజరైన పూర్వ విద్యార్థులు

మాడుగుల రూరల్: చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యానికి గురి కావడం, ఆర్థిక ఇబ్బందులతో తన కుమార్తెకు వివాహం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. మండలంలో ముకుందపురం గ్రామానికి చెందిన ఆకుల ఆదినారాయణ 1993–94 విద్యా సంవత్సరంలో వడ్డాది హైస్కూలులో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆదినారాయణకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె సత్యదీపికకు అదే గ్రామానికి చెందిన స్వరూప్‌తో బుధవారం రాత్రి వివాహమైంది. ఆదినారాయణతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ పెళ్లి హాజరై రూ.50 వేలు నగదుతో పాటు ఒక పట్టు చీరను వధువుకు అందజేసి, దీవించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇల్లపు నాయుడు, పుట్రేవు రమేశ్(ఉప తహసీల్దారు), సీఐ చీపురుపల్లి సింహాద్రినాయుడు, గరికపాటి గంగాధర్, పి.కోటేశ్వరావు, పచ్చికూర కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ.307 వచ్చేలా పని చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో దాసరి కొండాజీ

నాతవరం: ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ.307 చొప్పున వేతనం వచ్చేలా పని చేయాలని ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండలంలో ఎం.బి.పట్నం గ్రామంలో గురువారం ఉపాధి హామీ పథకం కూలీలు, మేట్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా పంచాయతీలో ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో నిబంధనలు అనుసరించి కూలీలు పనులు చేయాలన్నారు. మేము చెప్పిన పద్ధతి ప్రకారం పని చేస్తే కచ్చితంగా ప్రతి వేతనదారుడికి అనుకున్న కూలీ డబ్బులు వస్తాయన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా పథకాలపై అవగాహన కల్పించారు.

లోఓల్టేజ్, విద్యుత్ కోతలతో ఇబ్బందులు

- ఇంటింటి కుళాయి కనెక్షన్లు పూర్తి చేయండి
- సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: గ్రామాల్లో లో ఓల్టేజీ, వేళాపాలా లేకుండా విధిస్తున్న విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పలు గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇంటింటి కుళాయిల కనెక్షన్లను పూర్తి చేసి, తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని పలు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా విద్యుత్ ఏఈ వెంకటరావు మాట్లాడుతుండగా మంచాల, శిరిజాంకు చెందిన ప్రజాప్రతినిధులు కల్పించుకుని గ్రామాల్లో లో ఓల్టేజ్, వేళాపాలా లేకుండా విధిస్తున్న విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైర్లు వేలాడుతూ భయం గొల్పుతున్నాయని, గత సమావేశంలో చెప్పినా నేటికి పరిష్కరించలేదని నిలదీశారు. దీనిపై ఎంపీడీవో కలగజేసుకుని వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. రాయితీపై అందించే సూర్య ఘర్ స్కీమ్‌ను అందరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మ మాట్లాడుతుండగా కో–ఆప్షన్ మెంబర్ షేకు సూర్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ అడ్డుపడ్డారు. జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత కొరవడి లక్ష్యం నెరవేరలేదని ఆక్షేపించారు. ఎంపీటీసీలకు రెండేళ్లుగా గౌరవ వేతనాలు అందడం లేదని, వెంటనే చెల్లించేలా చూడాలని సభ్యులంతా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందరరావు, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు, తహసీల్దార్ లింకన్ పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

గొలుగొండ: పప్పుశెట్టిపాలెం గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి చెక్ పవర్ రద్దు చేసినట్లు ఎంపీడీవో మేరీ రోజ్ తెలిపారు. గురువారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మేదేవిపేట గ్రామంలో కమ్యూనిటీ భవనం పనుల్లో 2022లో సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేసినట్లు వచ్చిన అభియోగాలు రుజువు కావడంతో ఆమె చెక్ పవర్ రద్దు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

మాడుగుల రూరల్: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు అన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎం.కోడూరులో విలేకర్లతో మాట్లాడారు. కాల్పుల సంఘటనను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. దాడికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెసు కన్వీనర్ ఏసురాజు, జిల్లా కోశాధికారి పుట్టా అమరయ్యగుప్తా, బుడబండి రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేరేడు బందలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది

రావికమతం: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చీమలపాడు పంచాయతీ గిరిజన గ్రామం నేరేడు బందలో డాక్టర్ రజిని ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు చేశారు. వారిలో ఇద్దరికి రక్త పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, వైద్య సిబ్బంది జోషి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి ఘన సత్కారం



నాగ జెడెక్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు జగ్గారావు

రావికమతం: చోడవరం భాష్యంలో చదువుతున్న రావికమతం మండలం గుడిప గ్రామ సర్పంచ్ గుమ్మాల గణేష్ కుమారుడు నాగ జెడెక్ పదో తరగతిలో ప్రతిభ కనబరిచాడు. తాజాగా విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో నాగ జెడెక్ 588/600 మార్కులు సాధించి రావికమతం మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో విద్యార్థి నాగ జెడెక్‌ను వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు కంచిపాటి జగ్గారావు ఘనంగా సత్కరించారు.

ప్రగతి పథంలో ఎం.అలమండ



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: ఎం.అలమండ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని స్థానిక సర్పంచ్ దాడి జగన్నాథరావు(జగన్) అన్నారు. ఎం.అలమండ గ్రామ సచివాలయంలో గురువారం గ్రామసభ జరిగింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల సహాయ సహకారాలతో ఎం.అలమండను అన్ని రంగాలలో అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో స్థానిక పంచాయతీ సెక్రటరీ అప్పలరాజు, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై మిశ్రమ దాణా

మాడుగుల: ప్రభుత్వం పాడి పశువుల కోసం 50 శాతం రాయితీపై దాణా అందజేస్తుందని ఏడీ వి.చిట్టినాయుడు తెలిపారు. గురువారం మాడుగుల ఏరియా పశువైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 కిలోలుదాణా బస్తా రూ.1100 కాగా.. 50 శాతం రాయితీపై రూ.550లకే లభిస్తుందన్నారు. రాయితీ దాణా కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి: దేవరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పెదనందిపల్లి ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. పెదనందిపల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌కు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు చేపట్టేందుకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పెదనందిపల్లి, చిననందిపల్లి, కాశీపురం, చేనులపాలెం, నాగయ్యపేట, తామరబ్బ, చింతలపూడి గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కోనాం ఫీడర్ పరిధిలో..

చీడికాడ: మండలంలోని కోనాం విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏఈ వెంకటరావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని కోనాం, మంచాల, గుడివాడ, గుంటి, శిరిజాం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.